క్లుప్తంగా

నియామక పత్రాల అందజేత



నియామక పత్రం అందజేస్తున్న చిరంజీవి

ఎచ్చెర్ల క్యాంపస్: పొన్నాడ పంచాయతీ వెంకన్నగారిపేట అంగన్‌వాడీ సహాయకురాలుగా అల్లు ధనలక్ష్మి, తెప్పరేవు సహాయకురాలుగా రుప్ప లతశ్రీ ఎంపికయ్యారు. వీరికి ఎచ్చెర్ల మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఎంపీపీ మొదలవలస చిరంజీవి నియామక పత్రాలు అందజేశారు. నాయకులు మురళీధర్ బాబా, నేతింటి నీలమప్పడు, అల్లు రాజారావు, పప్పల వెంకటరమణ పాల్గొన్నారు.

అంగన్‌వాడీలు పారదర్శకంగా పని చేయాలి



నియమాక పత్రాలు అందజేస్తున్న కిరణ్‌కుమార్

రణస్థలం: అంగన్‌వాడీ కార్యకర్తలు పారదర్శకంగా పనిచేసి గర్భిణులు, చిన్నారులకు సంపూర్ణ పోషణ అందించాలని ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ అన్నారు. స్థానిక క్యాంపు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో జి.సిగడాం, ఎచ్చెర్ల, లావేరు, రణస్థలం మండలాల్లో నూతనంగా ఎంపికైన 17 మంది అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకులకు నియమాక పత్రాలను ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అంగన్‌వాడీ కేంద్రాలకు అధిక నిధులు కేటాయించి సంపూర్ణ పోషణ అందజేస్తున్నారన్నారు. చిన్నారులు, బాలింతలు, గర్భిణులకు శతశాతం పోషక ఫలాలు అందేలా చూడాలన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ పీవో రూన్సీ, వైఎస్సార్‌సీపీ నాయకులు లంకలపల్లి ప్రసాద్, రెడ్డి విశ్వేశ్వరరావు, పతివాడ సత్యం, పిన్నింటి లక్ష్మునాయుడు ఉన్నారు.

అర్హులందరికీ 'నేతన్న నేస్తం'

లావేరు: అర్హులందరికీ నేతన్న నేస్తం పథకం వర్తిస్తోందని చేనేత అభివృద్ధి అధికారి శేఖర్ అన్నారు. అప్పాపురం గ్రామంలోని చేనేత కాలనీలో సోమవారం సంబంధిత అధికారులు సోమవారం పర్యటించి చేనేత కార్మికుల ఇళ్లల్లోని మగ్గాలను పరిశీలించారు. 65 మగ్గాలు ఉన్నట్టు గుర్తించారు. ఈ సందర్భంగా శేఖర్ మాట్లాడుతూ.. మగ్గం ఉన్న ప్రతి చేనేత కుటుంబానికి ప్రభుత్వం నేతన్న నేస్తం పథకం మంజూరు చేసి ఏడాదికి రూ. 24 వేలు అందజేస్తోందన్నారు. క్లస్టర్ డెవలప్‌మెంటు ఎగ్జిక్యూటివ్ కొనవల జగదీష్, వెల్ఫేర్ అసిస్టెంట్ సంతోష్, మాజీ సర్పంచ్ కనకం అప్పారావు, వలంటీరు గౌరునాయుడు ఉన్నారు.

పకడ్బందీగా ఓటర్ల పరిశీలన



మాట్లాడుతున్న ఆర్డీవో శాంతి

గార: ఇంటింటికీ వెళ్లి ఓటర్ల పరిశీలనకు పకడ్బందీగా చేపట్టాలని ఆర్డీవో బి.శాంతి అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మండలస్థాయి బీఎల్‌వోలతో సోమవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఓటర్ల తొలగింపు ప్రక్రియలో స్థానిక నాయకుల సహకారం, సిఫారసులను పరిగణలోకి తీసుకోవద్దన్నారు. ఆన్‌లైన్‌లో నమోదు చేయించే బాధ్యత బీఎల్‌వోలు తీసుకోవాలన్నారు. ఫిర్యాదులపై ముందుగానే పరిశీలించాలని, చివరి పబ్లికేషన్ వరకు ఆగవద్దన్నారు. ఓటరు లిస్టులో ఫొటోలు అప్‌లోడ్ చేయాలన్నారు. ఆన్‌లైన్ నమోదులో కొందరు ప్రాధాన్యత వ్యక్తుల ఫొటోలు పెట్టే అవకాశం ఉందని, దీనిపై పోలింగ్ స్టేషన్ పరిధిలో బీఎల్‌వోలే బాధ్యత తీసుకోవాలన్నారు. ఫారం 6, 7, 8లు ఇంటి వద్దే తీసుకోవాలన్నారు. దీనివలన మీకు శ్రమ తగ్గే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ జెన్ని రామారావు, డిప్యూటీ తహసీల్దార్ సీహెచ్‌జీవీవీ ప్రసాదరావు పాల్గొన్నారు.

ఫణిబాబుకు డాక్టరేట్ ప్రదానం



డాక్టరేట్ అందుకుంటున్న ఫణిబాబు

రణస్థలం: పైడిభీమవరం గ్రామానికి చెందిన ఆకెళ్ల ఫణిబాబుకు డాక్టరేట్ వరించింది. ఏయూలో సోమవారం జరిగిన కార్యక్రమంలో వీసీ ప్రసాద్‌రెడ్డి నుంచి ఆయన డాక్టరేట్‌ను అందుకున్నారు. ప్రొఫెసర్ నిమ్మ వెంకటరావు పర్యవేక్షణలో శ్రీకాకుళం జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో విద్యార్థుల నమోదు, నిలుపుదల, విద్యా నాణ్యతపై చేసిన పరిశోధనకు డాక్టరేట్ వచ్చినట్టు ఫణిబాబు తెలిపారు.

జగనన్న సురక్షపై సమీక్ష

జి.సిగడాం: జగనన్న సురక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అధికారులు కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సచివాలయ సిబ్బంది, కార్యదర్శులు, వీఆర్వోలు, వలంటీర్లతో సోమవారం నిర్వహించిన సమావేశంలో పాల్గొన్న అధికారులు పలు సూచనలు చేశారు. తహసీల్దార్ పప్పల వేణుగోపాలరావు, ఎంపీడీవో నిశ్చల, ఈవోపీఆర్డీ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

దురలవాట్లకు యువత బలికావద్దు



శ్రీకాకుళం క్రైమ్: మాట్లాడుతున్న ఒకటో పట్టణ ఇన్‌చార్జి ఎస్సై రవికుమార్

- మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవంలో వక్తలు

రణస్థలం: మాదకద్రవ్యాలకు అలవాటుపడి యువత భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దని, దూరాలవాట్లకు దూరంగా ఉండాలని రణస్థలం స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సీఐ సీహెచ్ కిరణ్ మహేశ్వరి అన్నారు. మండల కేంద్రంలోని సాయి డిగ్రీ కళాశాలలో యువతకు మాదకద్రవ్యాల వినియోగంతో వచ్చే నష్టాలపై సోమవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కలిసి ర్యాలీ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. మాదక ద్రవ్యాల వాడకంతో కలిగే దుష్ప్రచారాన్ని వివరించారు. పట్టుబడితే ఎలాంటి కేసులు నమోదవుతాయో తెలియజేశారు. కార్యక్రమంలో ఎస్‌ఈబీ ఎస్సై ఎస్‌కే రహీమ్, కానిస్టేబుళ్లు గుణపు శ్రీనివాసరావు, మెండ రమణ ఉన్నారు.

పోటో26ఈటీఎల్42-280023: రణస్థలం: విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఈబీ అధికారులు

అలవాటైతే కష్టమే..

శ్రీకాకుళం క్రైమ్: మత్తుకు అలవాటుపడితే జీవితం నాశనమవుతోందని ఒకటో పట్టణ ఇన్‌చార్జి ఎస్సై రవికుమార్ అన్నారు. అంతర్జాతీయ మాదకద్రవ్య వ్యతిరేక దినోత్సవం సందర్భంగా ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని చైతన్య జూనియర్ కళాశాలలో మాదకద్రవ్యాల వాడకం వలన కలిగే అనర్థాలపై రవికుమార్ విద్యార్థులకు అవగాహన కల్పించారు. డ్రగ్స్, కొకైన్, గంజాయికి అలవాటుపడితే అనారోగ్యం ఖాయమన్నారు. వీటికి దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఒకటో పట్టణ ఏడీ(రైటర్) రాంబాబు, కానిస్టేబుల్ లక్ష్మణరావు, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

రెండో పోలీసు స్టేషన్ పరిధిలో

శ్రీకాకుళం క్రైమ్: మత్తుకు యువత దూరంగా ఉండాలని రెండో పట్టణ పోలీస్ స్టేషన్ ఎస్ఐ నాగిరెడ్డి లక్ష్మణరావు అన్నారు. నగరంలోని ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల, కాకినాడ ఆదిత్య డిగ్రీ కళాశాల, కాకినాడ ఆదిత్య జూనియర్ కళాశాలల్లో మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని నిర్వహించారు. మత్తు పదార్థాలకు దూరంగా ఉంటామని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. మత్తు పదార్థాలు వాడినట్లు, క్రయ విక్రయాలు జరుపుతున్నట్లు తెలిస్తే టోల్‌ఫ్రీ నంబర్ 14500, 100కు తెలియజేయాలన్నారు.

బానిస కావొద్దు

శ్రీకాకుళం క్రైమ్: మత్తు పదార్థాలకు బానిసలు కావొద్దని శ్రీకాకుళం స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో ఎస్ఐ కనకం కల్యాణి అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆర్ట్స్ జూనియర్ కళాశాలలో అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు.

బ్లడ్‌బ్యాంకులో..

శ్రీకాకుళం కల్చరల్: మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా లవ్లీ ప్రొఫెషనల్ యూనివర్సిటీ విద్యార్థులకు స్థానిక బ్లడ్ బ్యాంకులో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించారు. రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావు మాట్లాడుతూ.. యువత చెడు మార్గం పట్టకుండా క్రమశిక్షణ కలిగి ఉండాలన్నారు. రెడ్‌క్రాస్ సభ్యులు కె.సత్యన్నారాయణ ఉన్నారు.



శ్రీకాకుళం క్రైమ్: విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయిస్తున్న సెబ్ ఎస్సై కనకం కల్యాణి



ప్రతిజ్ఞ జేస్తున్న ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల విద్యార్థులు



రణస్థలం: అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఈబీ అధికారులు

సంక్షేమం, అభివృద్ధికి సమ ప్రాధాన్యం



ప్రజలకు సంక్షేమాన్ని వివరిస్తున్న ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్

- ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్
- ధర్మవరం సచివాలయం పరిధిలో 'గడప గడపకు మన ప్రభుత్వం'

ఎచ్చెర్ల క్యాంపస్: సంక్షేమం, అభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సమాన ప్రాధాన్యం ఇస్తూ పాలన సాగిస్తున్నారని ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ అన్నారు. ధర్మవరం గ్రామ సచివాలయం పరిధిలోని ఎస్సీ కాలనీ, పెద్దరుప్పపేట, లావేటిపేట, రామజోగిపేట గ్రామాల్లో 'గడప గడపకు మన ప్రభుత్వం'కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఇందులో భాగంగా ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలను వివరించారు. రేషన్ కార్డుల వారీగా చేకూరిన లబ్ధిని తెలియజేసి బ్రోచర్లు అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రభుత్వం ఏర్పడిన నాలుగేళ్లలో నవరత్నాల ప్రభుత్వ పథకాలతో పాటు అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేసినట్లు చెప్పారు. గ్రామాల్లో సచివాలయాలు, వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లు, రైతు భరోసా, అంగన్‌వాడీ కేంద్రాల నిర్మాణాలు చేపట్టినట్లు పేర్కొన్నారు. ప్రతిపక్షాలు, ఎల్లో మీడియా చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని ప్రజలు నమ్మేస్థితిలో లేరన్నారు. వచ్చేనెల ఒకటో తేదీ నుంచి నిర్వహించనున్న జగనన్న సురక్ష ద్వారా ప్రజల నుంచి వచ్చే సమస్యలను పరిష్కరించనున్నట్లు చెప్పారు. రాష్ట్ర ముఖ్యమంత్రిగా మరో అవకాశం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి ఇచ్చేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. గ్రామ సచివాలయ, వలంటీర్ వ్యవస్థ ద్వారా అర్హతే ప్రామాణికంగా సంక్షేమాన్ని చేరువ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎచ్చెర్ల ఎంపీపీ మొదలవలస చిరంజీవి, మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితుడు మాడుగుల మురళీధర్‌బాబా, ఎస్ ఎంపురం పీఏసీఎస్ అధ్యక్షుడు సనపల నారాయణరావు, జేసీఎస్ ఇన్‌చార్జి మూగి శ్రీరాములు, మండల విప్ బగ్గు రాజారావు, నాయకులు బెండు రామారావు, నక్క కృష్ణమూర్తి, బొడ్డేపల్లి సుధాకర్, అల్లు సూర్యనారాయణ, యండ రాంబాబు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ దివ్య, హౌసింగ్ ఏఈ రాజేంద్రప్రసాద్, వెలుగు ఏపీఎం రాంమూర్తి, ఉపాధి హామీ ఏపీవో శోభాదేవి పాల్గొన్నారు.

జేసీఐ సన్‌రైజర్స్‌కు అవార్డులు



అవార్డులతో జేసీఐ సభ్యులు

శ్రీకాకుళం అర్బన్: జేసీఐ శ్రీకాకుళం సన్‌రైజర్స్‌కు అవార్డులు లభించాయి. విశాఖపట్నం బీచ్ రోడ్‌లోని సాగరిక కన్వెన్షన్‌లో ఆదివారం రాత్రి జేసీఐ మిడ్‌కాన్ సదస్సు జరిగింది. జేసీఐ చేసిన సేవా, లీడర్ షిప్ ట్రైనింగ్ ప్రోగ్రామ్స్ వంటి అద్వితీయమైన కార్యక్రమాలకు గుర్తుగా జోన్-4 ప్రెసిడెంట్ జీఎస్ఎస్ వర్మ, వైస్ ప్రెసిడెంట్ అనుదీప్ జోసెఫ్, జోన్ డైరెక్టర్ సురేష్ గొంప గార్ల చేతుల మీదుగా జేసీఐ శ్రీకాకుళం సభ్యులు 12 అవార్డులు అందుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈ ఏడాది వేసవి కాలంలో 60 రోజుల పాటు మజ్జిగ పంపిణీ చేసి సుమారు 70 వేల మంది దాహార్తిని తీర్చారని గుర్తు చేశారు. అలాగే పది వేల మంది యువతకు సీపీఆర్‌లో శిక్షణ ఇచ్చారన్నారు. అవార్డులు గెలుచుకున్నవారిలో జేసీలు ఎస్‌వీ సతీష్, ఎస్.ప్రవీణ్, బి.ప్రవీణ్, బి.సతీష్, వి.శిరీష, పి.దామోదర్ తదితరులు ఉన్నారు. వీరందరికీ జేసీఐ శ్రీకాకుళం సన్ రైజర్స్ అధ్యక్షులు డాక్టర్ వినోద్ కుమార్ కూర్మాన, చార్టర్ ప్రెసిడెంట్ సంతోష్ దూసి, ఆర్గనైజేషన్ అడ్వయిజర్ గీత శ్రీకాంత్ అభినందించారు.

వైఎస్సార్ లా నేస్తం నిధుల విడుదలపై హర్షం

శ్రీకాకుళం పాతబస్టాండ్: వైఎస్సార్ లా నేస్తం నిధులను ప్రభుత్వం విడుదల చేసినందుకు జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ ఎన్ని సూర్యారావు, పలువురు న్యాయవాదులు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా అర్హులైన 2,677 మంది యువ లాయర్ల ఖాతాల్లో నెలకు రూ. 5 వేలు స్టైఫండ్ విడుదలలో భాగంగా తొలి విడత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వారి ఖాతాల్లో జమ చేశారన్నారు. ఈ ఏడాది ఫిబ్రవరి నుంచి జూన్ వరకు రూ.25 వేల చొప్పున అందించినట్టు చెప్పారు. హర్షం వ్యక్తం చేసిన వారిలో పబ్లిక్ ప్రాసిక్యూటర్లు వాన కృష్ణచంద్, స్టేట్ బార్ మెంబర్ గేదెల వాసుదేవరావు, కె.అప్పీసునాయుడు, తంగి శివప్రసాద్, న్యాయవాదులు కూన అన్నంనాయుడు, బొత్స సుదర్శనరావు, ఎన్ని రమేష్ ఉన్నారు.

మొక్కలే ప్రాణకోటికి జీవనాధారం



మొక్కలు నాటుతున్న దృశ్యం

శ్రీకాకుళం అర్బన్: ప్రాణకోటికి జీవంపోసే శక్తి మొక్కలకు మాత్రమే ఉందని శ్రీకాకుళం నగరానికి చెందిన ప్రముఖ వైద్యులు డాక్టర్ మూల వెంకట్రావు, డాక్టర్ జి.ప్రమీల, డాక్టర్ భానుమూర్తి అన్నారు. పర్యావరణ పరిరక్షణలో మొక్కలు ప్రధాన పాత్ర పోషిస్తాయని చెప్పారు. శ్రీకాకుళం నగరంలోని ఆర్ట్స్ కళాశాల ఆవరణలో స్టార్ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని సోమవారం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్లోబల్ వార్మింగ్‌ను అరికట్టడానికి ప్రతిఒక్కరూ సామాజిక బాధ్యతతో మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలన్నారు. నాటిన మొక్కల సంరక్షణపై దృష్టిసారించాలన్నారు. కార్యక్రమంలో స్టార్ వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు శాసపు జోగినాయుడు, వాకర్స్ మాజీ గవర్నర్ జి.ఇందిరాప్రసాద్, వాకర్స్ ఇంటర్నేషనల్ చీఫ్ కోఆర్డినేటర్ పి.జి.గుప్తా, ప్రతినిధులు కూన వెంకటరమణమూర్తి, బి.దేవీప్రసాద్, ఎం.మల్లిబాబు, గోలీ ఉమామహేశ్వరరావు, కె.రవి, బడే వెంకటరమణ, సింహాద్రి వేణుగోపాల్ పాల్గొన్నారు.

యువత నైపుణ్యాన్ని కనబర్చాలి

- ఎస్పీ జి.ఆర్.రాధిక



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జిల్లా ఎస్పీ రాధిక తదితరులు

శ్రీకాకుళం క్రైమ్: ఈ నెల 28న నిర్వహించే యువజనోత్సవాల్లో యువత ఉత్సాహంగా పాల్గొని ప్రతిభ కనబర్చాలని జిల్లా ఎస్పీ జి.ఆర్.రాధిక పిలుపునిచ్చారు. ఈ మేరకు జిల్లా పోలీసు కార్యాలయంలో యువజనోత్సవాల పోస్టర్‌ను సోమవారం ఆవిష్కరించారు. భారత ప్రభుత్వం కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడా మంత్రిత్వ శాఖ వారు నెహ్రూ యువకేంద్ర, ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలల సంయుక్త ఆధ్వర్యంలో 28వ తేదీ ఉదయం 9.30 గంటలకు కార్యక్రమం నిర్వహిస్తున్నారన్నారు. భారతదేశం-2047 థీమ్‌తో సృజనాత్మక రచన, కవిత్వం, చిత్రలేఖనం, మొబైల్ ఫొటోగ్రఫీ, ఉపన్యాసం , సాంస్కృతిక, జానపద కళల వంటి అంశాలపై యువ ఉత్సవ్ నిర్వహించనున్నట్లు ఎన్‌వైకే కోఆర్డినేటర్ ఉజ్వల్ ఎస్పీకి వివరించారు. విజేతలకు బహుమతులు అందజేస్తామన్నారు. ప్రతిభావంతులు జాతీయస్థాయి యువ ఉత్సవ్‌కు వెళ్లే అవకాశముందన్నారు. 15 నుంచి 29 ఏళ్లలోపు ఔత్సాహికులైన యువకులు ఉత్సవంలో పాల్గొనాలన్నారు. వివరాలకు 94921 18960 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

ఆరు పంచాయతీలకు డిజిటల్ లైబ్రరీలు మంజూరు

లావేరు: మండలంలోని ఆరు పంచాయతీలకు డిజిటల్ లైబ్రరీలు మంజూరైనట్టు పంచాయతీరాజ్ ఏఈ లింగాల అప్పన్న తెలిపారు. లావేరులోని మండల పరిషత్ కార్యాలయంలో భవన నిర్మాణ పనులపై నిర్మాణదారులతో సోమవారం సమీక్ష చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సెప్టెంబర్ నెలాఖరునాటికి ప్రాధాన్యత భవనాల నిర్మాణ పనులు పూర్తి చేయాలన్నారు.

పెదలింగాలవలస, వెంకటాపురం, కొత్తకుంకాం, అదపాక, బెజ్జిపురం, లక్ష్మీపురం పంచాయతీలకు డిజిటల్ లైబ్రరీలు మంజూరైనట్టు వివరించారు. ఒక్కో లైబ్రరీ నిర్మాణానికి రూ.16 లక్షల చొప్పున నిధులు మంజూరు కావడం జరిగిందన్నారు. అలాగే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం పూర్తయిన సచివాలయాల్లో అభివృద్ధి పనుల కోసం రూ.1.24 కోట్లు మంజూరైనట్టు చెప్పారు. వాటిలో అదపాక గ్రామంలో గెడ్డపై కల్వర్టు నిర్మాణానికి రూ. 20 లక్షలు, పెదలింగాలవలసలో కమ్యూనిటీ భవనం నిర్మాణానికి నిధులు మంజూరయ్యావన్నారు. ఏఈతో పాటు జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యుడు గొర్లె అప్పలనాయుడు ఉన్నారు.

అన్నపూర్ణ పథకానికి రూ.25 వేల విరాళం



ప్రసాద్‌ను సత్కరిస్తున్న సంఘ సభ్యులు

శ్రీకాకుళం కల్చరల్: ప్రముఖ పారిశ్రామికవేత్త, వరం ఛారిటబుల్ ట్రస్ట్ మేనేజింగ్ డైరెక్టర్ అందవరపు ప్రసాద్ తన పుట్టిన రోజు సందర్భంగా రిమ్స్‌లో సత్యసాయి అన్నపూర్ణ నిత్య అన్నదాన పథకానికి రూ.25 వేలు విరాళంగా సోమవారం అందచేశారు. ఈ సందర్భంగా నిత్యాన్నదాన పథకాన్ని సందర్శించి అక్కడే కేక్ కట్ చేసి అందరికీ అన్నప్రసాద వితరణ చేశారు. విరాళాన్ని సంఘం అధ్యక్షుడు జి.రమణబాబుకు అందించారు. ఈ సందర్భంగా ప్రసాద్‌ను సంఘం ప్రతినిధులు దుశ్శాలువతో కప్పి సత్కరించారు. కార్యక్రమంలో సంఘం జాయింట్ సెక్రటరీ కిల్లాన ఫాల్గుణరావు, జిల్లా సమన్వయకర్త సూర రామచంద్రరావు, మురళి, మేనేజర్ లక్ష్మణ్ పాల్గొన్నారు.

విద్యకు ప్రాధాన్యం



మాట్లాడుతున్న శ్రీనివాసరావు

జి.సిడాం: విద్యకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అధిక ప్రాధాన్యం ఇస్తున్నారని ఎంఈవో-2 ముళ్ల శ్రీనివాసరావు అన్నారు. స్థానిక మోడల్ పాఠశాలలో విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నాడు-నేడు పథకం ద్వారా ప్రభుత్వ పాఠశాలలకు మహర్దశ కల్పించారన్నారు. మోడల్ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు మంచి ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయిలో గుర్తింపు తీసుకురావాలన్నారు. పిల్లల చదువుపై తల్లిదండ్రులు కూడా దృష్టిసారించాలన్నారు. సమావేశంలో ప్రిన్సిపాల్ డాక్టర్ అన్నా శామ్యేల్‌లంక, అధ్యాపకులు చీరాపు రవికుమార్, ఉషారాణి, అరుణకుమారి, ప్రమీల ఉన్నారు.

నేడు జిల్లా జూనియర్స్ బాస్కెట్‌బాల్ జట్ల ఎంపిక

శ్రీకాకుళం న్యూకాలనీ:జిల్లా జూనియర్స్ బాస్కెట్‌బాల్ జట్ల ఎంపికలు మంగళవారం స్థానిక ఎన్టీఆర్ ఎంహెచ్ స్కూల్ వేదికగా జరగనున్నాయని శ్రీకాకుళం జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ చైర్మన్ ఎమ్మెస్సార్ కృష్ణమూర్తి తెలిపారు. ఇక్కడ ఎంపిక చేసిన జట్లను కృష్ణా జిల్లా నూజివీడు వేదికగా జరగనున్న 8వ ఏపీ రాష్ట్రస్థాయి జూనియర్స్ బాలబాలికల బాస్కెట్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీలకు పంపించనున్నట్టు చెప్పారు. ఎంపికల్లో పాల్గొనే క్రీడాకారులు 2005 జనవరి ఒకటి తర్వాత జన్మించి ఉండాలని స్పష్టం చేశారు. 27వ తేదీన సాయంత్రం 4 గంటలకు శ్రీకాకుళం ఎన్టీఆర్ మున్సిపల్ కార్పొరేషన్ బాస్కెట్‌బాల్ కోర్టు వద్ద రిపోర్ట్ చేయాలని సూచించారు. మరిన్ని వివరాలకు కోచ్ జి.అర్జున్‌రావురెడ్డి సెల్ నంబర్ 9949291288ను సంప్రదించాలన్నారు.

నేటితో ముగియనున్న సమ్మర్ క్యాంప్

ఎన్టీఆర్ మున్సిపల్ హైస్కూల్ వేదికగా 5 రోజులుగా కొనసాగుతున్న వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు మంగళవారం సాయంత్రంతో ముగియనున్నాయి. బాస్కెట్‌బాల్, సపక్‌తక్రా క్రీడాంశాల్లో క్రీడాకారులకు శిక్షణను అందించి, మెలుకువలు నేర్పించినట్టు ఎమ్మెస్సార్ కృష్ణమూర్తి తెలిపారు.

వలంటీర్ల సేవలు అభినందనీయం



వలంటీర్లతో మాట్లాడుతున్న రామ్‌మనోహర్‌నాయుడు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): వలంటీర్ల సేవలు అభినందనీయమని వైఎస్సార్‌సీపీ యువ నాయకుడు ధర్మాన రామ్‌మనోహర్‌నాయుడు అన్నారు. ప్రజలకు- ప్రభుత్వానికి మధ్య వారధిలా ఉంటూ అనేక సేవలందిస్తున్నారని కొనియాడారు. శ్రీకాకుళం కాజీపేట పంచాయతీ పరిధిలోని వలంటీర్లతో సోమవారం ఇంటింటికీ వెళ్లి వివరాల సేకరణ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వలంటీర్లు ప్రజల సమస్యలు తెలుసుకుని అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ కార్యక్రమాలు అందిస్తున్నారన్నారు. కరోనా వంటి విపత్కర పరిస్థితుల్లో వలంటీర్లు వారి ప్రాణాలను ఫణంగా పెట్టి విశేష సేవలు అందించారన్నారు. వలంటీర్ వ్యవస్థను ప్రవేశపెట్టిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నామన్నారు. కార్యక్రమంలో గార ఎంపీపీ గొండు రఘురాం, నాయకులు గొలివి వెంకటరమణమూర్తి, కరం చంద్, తెలుగు రమేష్, అప్పుయాదవ్, గాయత్రి, గంగు శారద, పద్మావతి, లక్ష్మణ్, గొల్లంగి వెంకటేష్, రాము, అప్పలరాజు, ఈశ్వర్ పాల్గొన్నారు.

బంకించంద్ర ఛటర్జీకి ఘన నివాళి



బంకించంద్ర ఛటర్జీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న కమిటీ ప్రతినిధులు

శ్రీకాకుళం అర్బన్: స్వాతంత్ర్య ఉద్యమ పోరాటంలో ప్రతి భారతీయుడు గుండెను రగిలించిన శక్తివంతమైన గీతం 'వందేమాతరం' అని గాంధీ మందిర కమిటీ సభ్యులు అన్నారు. శ్రీకాకుళం శాంతినగర్‌లోని గాంధీ మందిరం స్వాతంత్ర్య సమరయోధుల స్మృతి వనంలో గాంధీ స్మారకనిధి ఆధ్వర్యంలో సోమవారం వందేమాతరం గీత రచయిత బంకించంద్ర చటర్జీ 185వ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం వక్తలు మాట్లాడుతూ.. స్వాతంత్ర్య ఉద్యమ కాలంలో బెంగాల్ విభజనకు బ్రిటిష్ ప్రభుత్వం ప్రయత్నించినప్పుడు స్వాతంత్ర్య సమర యోధులందరూ వందేమాతర ఉద్యమాన్ని నిర్వహించారని గుర్తు చేశారు. బంకించంద్ర ఛటర్జీ రచించిన ఆనందమఠ్ పుస్తకంలో నుంచి వందేమాతర గీతాన్ని ఎంపిక చేసి స్వాతంత్ర్య ఉద్యమ పోరాటంలో ప్రత్యేకంగా ప్రచారం చేశారన్నారు. వందేమాతరం ప్రతి భారతీయుని గుండెల్లో దేశభక్తిని, ఉద్యమ స్ఫూర్తిని రగిలించిందని, ఇది నేటికీ రగిలిస్తూనే ఉందని వక్తలు తెలిపారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ జిల్లా చైర్మన్ పి.జగన్‌మోహన్‌రావు, విగ్రహదాత నిక్కు అప్పన్న, కన్వీనర్లు జామి భీమశంకరరావు, ఎం.ప్రసాదరావు, మెట్ట అనంతం బట్లు, కొంక్యాన వేణుగోపాల్, పొన్నాడ రవికుమార్, పందిరి అప్పారావు, గుత్తు చిన్నారావు, నక్క శంకరరావు, నిక్కు హరిసత్యం, గాంధీ మందిర్ కమిటీ ప్రతినిధులు మెట్ట గౌరీ శంకర్, సత్యనారాయణ పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

బోరు ఏర్పాటు

రణస్థలం: దేరసాం శ్మశానవాటికలో గ్రామస్తుల కోరిక మేరకు చేతిపంపు ఏర్పాటు చేశామని సర్పంచ్ మీసాల రామారావు తెలిపారు. మండల పరిషత్ నిధుల్లో భాగంగా రూ. రెండు లక్షలతో ఏర్పాటు చేసిన బోరును సోమవారం ప్రారంభించారు.

అభివృద్ధి పనులు పరిశీలన

ఎచ్చెర్ల క్యాంపస్: బొంతలకోడూరులో జరుగుతున్న అభివృద్ధి పనులను ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ పరిశీలించారు. ఆక్రమణదారుల నుంచి స్వాధీనం చేసుకున్న మలిపెద్దివాని చెరువులో జరుగుతున్న ఉపాధి పనులను పరిశీలించి వేతనదారులతో మాట్లాడారు. గరిష్ట వేతనం గిట్టుబాటయ్యేలా చూడాలని సిబ్బందికి సూచించారు. పనులు జరుగుతున్న చోట టెంట్లు, మంచినీరు, ఫస్ట్ ఎయిడ్ కిట్లు అందుబాటులో ఉంచాలన్నారు. నిర్మాణంలో ఉన్న సచివాలయం, రైతు భరోసా కేంద్రం, హెల్త్ సెంటర్ భవనాలను పరిశీలించారు. ఎంపీపీ మొదలవలస చిరంజీవి, సర్పంచ్ పంచిరెడ్డి రాంబాబు, ఎంపీటీసీ సభ్యుడు మాడుగుల జగదీష్ ఉన్నారు.

చెరువుల ఆక్రమణపై ఫిర్యాదు

రణస్థలం: దేరసాం గ్రామంలో 11 చెరువులు ఆక్రమణకు గురికావడంతో ఆయకట్టుకు సాగునీరు అందక ఇబ్బంది పడుతున్నామని రైతులు తెలిపారు. ఈ మేరకు గ్రామ యువత, రైతులు తహసీల్దార్ సనపల కిరణ్‌కుమార్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. అలాగే గ్రామంలో చెత్త పేరుకుపోయి ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారని ఎంపీడీవో ఆర్.వి.రమణమూర్తికి ఫిర్యాదు చేశారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

శ్రీకాకుళం రూరల్: ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని నైరా సర్పంచ్ అరవల రామ్ ప్రతాప్ అన్నారు. నైరా ప్రాథమిక పాఠశాలలో సోమవారం ఏర్పాటు చేసిన తల్లిదండ్రుల కమిటీ సమావేశంలో భాగంగా అమ్మఒడి లబ్ధిదారులతో మాట్లాడారు. అర్హులైన అమ్మఒడి పథకం లబ్ధిదారులంతా ఈకేవైసీ తప్పకుండా చేసుకోవాలన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన

ఎచ్చెర్ల: రైతులు ప్రకృతి వ్యవసాయ ప్రణాళిక పక్కాగా ఖరీఫ్ సీజన్‌లో అమలు చేయాలని ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్టు మాస్టర్ ట్రైనర్ లక్ష్మీనాయుడు అన్నారు. జరజాం పంచాయతీ గొలివివానిపేటలో ప్రకృతి వ్యవసాయంపై రైతులతో పొలంబడి కార్యక్రమం సోమవారం నిర్వహించారు. పచ్చిరొట్ట విత్తనాల సాగు, విత్తణశుద్ధి, ఘన జీవామృతం, కషాయాల తయారీపై అవగాహన కల్పించారు.

28న సంతోషిమాత జయంతి ఉత్సవం

శ్రీకాకుళం కల్చరల్: పాతశ్రీకాకుళంలోని సంతోషి మాత అమ్మవారి జయంతి వేడుకలు ఈనెల 28న నిర్వహిస్తున్నట్టు ఆలయ ఈవో రాధాకృష్ణ, అర్చకులు మోదుకురి కిరణ్‌శర్మ తెలిపారు. 108 లీటర్ల పాలతో అభిషేకాల సేవ, పట్టు వస్త్రాల సమర్పణ, 13 పట్టు చీరలతో చండీ హోమం, మృత్యుంజయ హోమాలు జరుగుతాయన్నారు.

విద్యుత్ సమస్య పరిష్కరించాలని వినతి

శ్రీకాకుళం పాతబస్టాండ్: గుజరాతీపేట సమీపంలోని తోటవీధిలో తరచూ నెలకుంటున్న విద్యుత్ సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరారు. నగర పరిధిలో ఈ ప్రాంతం ఉన్నప్పటికీ టౌన్ ఫీడర్‌తో అనుసంధానం చేయకుండా రూరల్ ఫీడర్‌లో ఉంచడంతో సమస్యలు వస్తున్నాయని చెబుతున్నారు. సమస్యను పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ ప్రయోజనం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి విద్యుత్ సమస్య లేకుండా చూడాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

నేటి నాయీ బ్రాహ్మణ గర్జన విజయవంతానికి పిలుపు

గార: శ్రీకాకుళంలోని అంబేడ్కర్ ఆడిటోరియంలో మంగళవారం జరగనున్న నాయీబ్రాహ్మణ గర్జన, థాంక్యూ ధర్మాన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మండల నాయీ బ్రాహ్మణ సేవా సంఘం సభ్యులు కోరారు. మండల కేంద్రంలో సోమవారం సంఘ నాయకులు కేవీ రమణమూర్తి, చందు, కామేష్ తదితరులు విలేకరులతో మాట్లాడారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో జగనన్న చేదోడు పథకం ద్వారా ఆదుకోవడంతో ఆర్థిక ఇబ్బందులు తగ్గాయన్నారు.

భగవద్గీతపై ప్రచారం

జి.సిగడాం: పాలఖండ్యాం, మర్రివలస, గేదెలపేట గ్రామాల్లో త్రైత సిద్ధాంత భగవద్గీతపై హిందూ ధర్మ ఆధ్మాత్మిక సభ్యులు సోమవారం ప్రచారం చేశారు. బొద్దాం త్రైతసిద్ధాంత ప్రబోధ సేవా సమితి, జ్ఞానవేదిక కమిటీ అధ్యక్షుడు రామకృష్ణ అధ్యర్యంలో ఇంటింటికీ వెళ్లి భగవద్గీత ప్రాధాన్యతను వివరించారు. కమిటీ సభ్యులు గణేష్, రామినాయుడు, కృష్ణ, సరస్వతి, లక్ష్మీభవాని, మమత ఉన్నారు.